# శబ్ద కాలుష్యము



## శబ్ద కాలుష్యమనేది అంతర్జాతీయ సమస్య

అందువలన మీరు కొన్ని ముఖ్యమైన విషయాలను తెలుసుకొనవలసి ఉంటుంది, లేకపోతే మీరు **చెవిటివారైపోతారు !**



శబ్దం గాయపరుస్తుంది

### శబ్ద కాలుష్యము వెనుక నిజానిజాలు

**ఉద్దేశ్యము :** ప్రజలకు శబ్ద కాలుష్యంపై పూర్తి అవగాహన కల్పించుట మరియు ఆరోగ్య సమస్యలు, చట్టాలు, నియమ నిబంధనలు మరియు న్యాయ స్థానాల యొక్క ఆదేశాలు వివరించుట.

SAI DESAM
LOVE ALL, SERVE ALL
UNIVERSAL TRUST
Regd. No.: 16/2014

HELP EVER, HURT NEVER

Trust promoted by
**CHERUKURI GROUP**
✆ 98852 06666 / 80086 68888

*Issued in Public Interest*

## A శబ్ద కాలుష్యము అంటే ఏమిటి ?

శబ్ద కాలుష్యము లేక శబ్దం వల్ల కలిగే ఇబ్బందులు లేక అధిక శబ్దం వల్ల మానవ జీవితం లేక జంతు జీవితాలలో సమతూల్యం దెబ్బతింటుంది. ప్రపంచవ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో శబ్దాలు యంత్రపరికరాల వల్ల, రవాణా వ్యవస్థ వల్ల, మోటారు వాహనాల వల్ల, విమానాల వల్ల మరియు ట్రైన్ల వల్ల కలుగుతాయి. బహిరంగ ప్రదేశాలలో శబ్దాన్ని సంగ్రహంగా ప్రపంచ పర్యావరణ శబ్ద కాలుష్యంగా పరిగణించవచ్చు. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ లేకపోవడం వలన శబ్ద కాలుష్యం ఏర్పడుతుంది. పారిశ్రామిక మరియు నివాస ప్రాంతాలు పక్కపక్కనే ఉండటంవలన నివాసయోగ్య ప్రాంతాలలో శబ్ద కాలుష్యం ఏర్పడుతుంది.

**క్రింద తెలిపిన ప్రమాణాలకు 10 డెసిబుల్స్ అధికముగా ఉంటే ఆ శబ్దాన్ని కాలుష్యంగా పరిగణిస్తారు.**

## B శబ్దానికి సంబంధించి వాతావరణంలో నాణ్యతా ప్రమాణాలు ఎలా ఉండాలి?

**శబ్ద కాలుష్యము యొక్క (రెగ్యులేషన్ మరియు నియంత్రణ) నిబంధనలు, 2000**
షెడ్యూల్డ్ రూల్3(1) మరియు 4(1) ప్రకారము

| ఏరియా కోడ్ | ప్రదేశము / జోన్ యొక్క వర్గీకరణ | డి.బి.9(ఎ) ఎల్.ఇ.క్యూ పరిమితులు | |
|---|---|---|---|
| | | పగటిపూట | రాత్రి పూట |
| ఎ | పారిశ్రామిక ప్రాంతము | 75 | 70 |
| బి | వాణిజ్య ప్రాంతము | 65 | 55 |
| సి | నివాస యోగ్య ప్రాంతము | 55 | 45 |
| డి | నిశబ్ద ప్రాంతము | 50 | 40 |

1. పగటి పూట అనగా ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు. రాత్రి పూట అనగా రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు
2. నిశబ్ద ప్రాంతము అనగా అర్హత కలిగిన అధికారిచే ప్రకటించబడిన ఏదైనా ప్రాంతము, ఆసుపత్రులు, విద్యా సంస్థలు, కోర్టులు మరియు మత సంబంధ ప్రదేశాలకు 100 మీటర్లకు తక్కువ కాకుండా ఉన్న ప్రాంతము.
3. మిశ్రమ వర్గీకరణ ప్రాంతాలను పైన తెలిపిన నాలుగు వర్గీకరణలలో ఏదో ఒక వర్గీకరణను సంబంధిత అధికారి ప్రకటిస్తారు. శబ్ద తీవ్రతను పై పట్టిక ప్రకారం కొలవబడుతుంది.

అందువలన ప్రభుత్వ నియమాల ప్రకారం పైన తెలిపిన విధంగా శబ్ద తరంగాలు పరిమితికి లోబడి ఉండాలి. పై పట్టికలోని పరిమితులకంటే శబ్ద తరంగాలు ఎక్కువగా ఉంటే దానిని శబ్దకాలుష్యంగా పిలుస్తారు.

## C వివిధ రకముల శబ్దములు మరియు డెసిబుల్స్‌లో వాటి తీవ్రత ఎంత ?

| వివిధ పరికరాలు - శబ్దాలు | డెసిబుల్స్‌లో |
|---|---|
| గ్రెనేడ్ | 160 |
| గన్‌షాట్ / దేవాలయములో పెద్ద గంటలు | 140 |
| **భరించలేని శబ్దము** | **130** |
| పెద్ద జెట్ విమానం ఎగిరేటప్పుడు | 120 |
| రాక్‌బ్యాండ్ శబ్దము | 110 |
| జాక్‌హ్యామర్ / దేవాలయములో చిన్న గంటలు | 100 |
| పెద్ద వాహనము | 90 |
| మధ్యరకమైన వాహనము | 80 |
| ప్యాసింజరు కారు | 70 |
| **సాధారణ సంభాషణ** | **60** |
| పట్టణ శివార్లలోని నివాస ప్రాంతము | 50 |
| లివింగ్ రూమ్‌లో శబ్దము | 40 |
| గ్రామీణ నివాస ప్రాంతము | 30 |
| గుసగుసలాడుట | 20-10 |

## D శబ్ద కాలుష్యాన్ని మన చెవులకు ఎంత సమయం అనుమతించవచ్చు ?

భగవంతుడు మనకు చెవుల ద్వారా వినడానికి అవకాశం కల్పించాడు, కానీ దానికి కొన్ని పరిమితులు ఉంటాయి. మన చెవులు పరిమితికి మించిన శబ్దానికి లోనైనప్పుడు మనం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఈక్రింది పట్టిక ద్వారా శబ్ద కాలుష్యాన్ని మన చెవులకు ఎంత సమయం వరకు అనుమతించవచ్చు అనేది తెలుస్తుంది.

| శబ్ద తీవ్రత (డెసిబుల్స్) | 24 గంటలలో అత్యంత ఎక్కువ సమయము |
|---|---|
| 85 | 8 గంటలు |
| 88 | 4 గంటలు |
| 91 | 2 గంటలు |
| 94 | 1 గంట |
| 97 | 30 నిమిషాలు |
| 100 | 15 నిమిషాలు |
| 103 | 7.5 నిమిషాలు |
| 106 | 3.7 నిమిషాలు |
| 109 | 112 సెకన్లు |
| 112 | 56 సెకన్లు |
| 115 | 28 సెకన్లు |
| 118 | 14 సెకన్లు |
| 121 | 7 సెకన్లు |
| 124 | 3 సెకన్లు |
| 127 | 1 సెకన్ |
| 130-140 | 1 సెకన్ కన్న తక్కువ |
| 140 | ఎలాంటి ప్రభావము లేదు |



## E శబ్ద కాలుష్యం వల్ల కలిగే దుష్పరిణామాలు ఏమిటి ?

శబ్ద కాలుష్యం వల్ల కలిగే దుష్పరిణామాలను మనము విస్మరించలేము. **ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO)** వారు సూచించిన ప్రకారం మానవులపై శబ్ద కాలుష్యం ఈ క్రింది విధమైన ప్రభావాలను చూపిస్తుంది.

1. సామాజిక ప్రవర్తనలో మార్పులు (దుడుకుతనం, నిరసనతత్వం మరియు నిస్సహాయ స్థితి).
2. మాట్లాడేటప్పుడు అంతరాయాలు కలుగుట.
3. కార్యాలయాలలో మరియు విద్యాలయాలలో పనితనంపై ప్రభావం చూపుతుంది.
4. నొప్పి మరియు వినికిడిలో అలసత్వం.
5. వినికిడి లోపము మరియు లేని శబ్దాలు విన్నట్టు అనిపించుట (tinnitus).
6. విసిగిపోయిన భావం కలుగుట.
7. నిద్రాభంగము మరియు దాని పర్యావసానమైన స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక సమస్యలు.
8. గుండెజబ్బు సమస్యలు.
9. హార్మోన్ల ప్రతిస్పందన (హార్మోన్లపై ఒత్తిడి), దాని పర్యావసానమైన సమస్యలు, న్యూట్రీషన్ మరియు రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది.

**శబ్ద కాలుష్యము యొక్క ప్రభావము వాటి కాలపరిమితిని బట్టి మానవులపై దుష్ప్రభావములు అనేక రకాలుగా ఉంటాయి. వాటిలో కొన్నింటిని ఈక్రింది విధంగా తెలియజేయుచున్నాము.**

- శబ్ద తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు కర్ణభేరి చెడిపోయే అవకాశం ఉంటుంది. చెవిలో అంతర్గతంగా ఉండే సూక్ష్మ కణాలు దెబ్బతింటాయి. కొన్ని శబ్దతరంగాల తీవ్రతవల్ల వినికిడి శక్తి తగ్గుతుంది లేదా కోల్పోతుంది.
- 1970 వ సంవత్సరంలో క్రైటర్ చెప్పినట్లు శబ్దాలవల్ల గుండె కొట్టుకొనే వేగం తగ్గి దానివల్ల రక్త నాళాలలో ఒత్తిడి మార్పులు చెంది, తద్వారా రక్తనాళాల యొక్క పరిమాణం (డయామీటర్) తగ్గిపోతుంది.
- శబ్ద తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల ఇస్నోఫిలియా (ఎలర్జీవంటి లక్షణాలు), హైపర్‌గ్లైకేమియా (రక్తంలో షుగర్ శాతం అసాధారణమైనదిగాను మరియు ఎక్కువగాను ఉండటం), హైపోకలెమియా (రక్త ప్రసరణలో పొటాషియం శాతం బాగా తక్కువగా ఉండి దాని పర్యావసానంగా బలహీనత మరియు గుండెలో అసాధారణమైన మార్పులు సంభవిస్తాయి) మరియు హైపోగ్లైకేమియా (రక్తంలో షుగర్ శాతం చాలా తక్కువగా ఉండటం), వంటి మార్పులు రక్తంలో సంభవిస్తాయి.
- శబ్దం వల్ల వృత్తి నిపుణులు పనితనాన్ని సమర్థవంతంగా



ప్రదర్శించలేకపోతారు. ముఖ్యంగా పనిపై తీక్షణమైన దృష్టిపెట్టి శ్రద్ధతో పని చేయవలసిన వారు చేయలేకపోతారు.

- అధిక శబ్ద కాలుష్యము తక్కువ సమయంలో మన చెవులు విన్నచో తాత్కాలికంగా వినికిడి లోపం ఏర్పడుతుంది. అధిక శబ్ద కాలుష్యము ఎక్కువ సమయంలో మన చెవులు విన్నచో శాశ్వత వినికిడి లోపం ఏర్పడుతుంది. శబ్ద తరంగాల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు కడుపులోని పిండానికి చాలా ప్రమాదం ఏర్పడి పిల్లల ప్రవర్తనలో విపరీతమైన మార్పులు సంభవిస్తాయి.

## F శబ్ద కాలుష్యానికి సంబంధించి భారతదేశంలో అమలులో ఉన్న చట్టాలేవి ?

**1. భారత రాజ్యాంగం, 1949 లోని 21వ అధికరణము.**

ఈ అధికరణము ప్రకారము పౌరుల జీవితానికి మరియు వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పించబడుతుంది. చట్టం అనుమతించిన విధానం ద్వారా తప్ప ఏ వ్యక్తి యొక్క జీవితం మరియు వ్యక్తిగత స్వేచ్ఛలకు భంగం కలిగించరాదు.

అందువలన ఏ వ్యక్తి అయినా ప్రశాంతంగా, సౌకర్యవంతంగా నివసించదలచినప్పుడు శబ్ద కాలుష్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకొని దాని బారిన పడకుండా చూసుకోవాలి. ప్రతి వ్యక్తి తనకు ఇష్టం వచ్చిన మతాన్ని ఆచరించవచ్చు. కాని లౌడ్‌స్పీకర్ల ద్వారా మరియు ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా శబ్దకాలుష్యాన్ని కలుగచేయకూడదు.

**2. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 లోని 133 అధికరణము.**

ఈ అధికరణం ప్రకారము అసౌకర్యాన్ని తొలగించ వలసినదిగా షరతులతో కూడిన ఆజ్ఞలు జారీచేయవచ్చు.

ఎవరైనా చట్ట విరుద్ధంగా బహిరంగ ప్రదేశాలలో అసౌకర్యం కల్పించినట్లు ఫిర్యాదు చేస్తే లేదా ఒక పోలీస్






అధికారినుండి రిపోర్టు వచ్చినట్లైతే, రాష్ట్ర ప్రభుత్వం తరుపున జిల్లా మెజిస్ట్రేట్ / సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ / ప్రత్యేకంగా అధికారం కల్పించబడిన ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అట్టి అసౌకర్యాన్ని నిర్మూలించవలసినదిగా ఆదేశించవచ్చు.

**3. ఇండియన్ పీనల్ కోడ్‌లోని 268 అధికరణము :**

**బహిరంగంగా అసౌకర్యం కల్పించడం :** ఏదైనా ప్రదేశంలో, ఎవరైనా వ్యక్తి బహిరంగంగా అసౌకర్యం, నష్టం లేదా గాయం కల్పిస్తున్నట్లయితే అట్టి అసౌకర్యం వల్ల వారు నివసిస్తున్న ప్రాంతాలలో ప్రజలకు హాని కల్గిస్తున్నట్లయితే అట్టి అసౌకర్యం నేరం క్రిందకు వస్తుంది. సామూహికంగా కలిగించే అసౌకర్యం కొందరికి సౌకర్యవంతంగానూ మరియు ఉపయోగకరంగానూ ఉంటుందనే వాదన మన్నించరానిది.

**4. ఇండియన్ పీనల్ కోడ్‌లోని 290 అధికరణము :**

**ఎక్కడా వివరించబడని అసౌకర్యం గురించి :** అనుమతి లేకుండా బహిరంగంగా ఎటువంటి అసౌకర్యమైనా కలిగిస్తున్నట్లయితే అందుకుగాను శిక్షను ఈ అధికరణము తెలియజేస్తుంది. ఎవరైనా బహిరంగంగా అసౌకర్యం కలిగిస్తున్నట్లయితే అట్టి వారికి 200 రూపాయల వరకు జరిమానా విధించవచ్చు.

**5. ఇండియన్ పీనల్ కోడ్‌లోని 291 అధికరణము :**

**నిషేదాజ్ఞలు ఉన్నప్పటికి నిరంతరాయంగా అసౌకర్యం కల్పించడం :** చట్టబద్ధంగా అధికారం కల్గిన ఎవరైనా ప్రభుత్వాధికారి నిషేదాజ్ఞలు విధించినప్పటికీ బహిరంగ అసౌర్యాన్ని మళ్ళీమళ్ళీ కొనసాగించుచున్నట్లయితే వారికి ఆరు నెలల వరకు శిక్ష లేదా జరిమానా లేదా రెండింటిని విధించవచ్చు.

**6. శబ్ద కాలుష్యం (నియంత్రణ) నిబంధనలు, 2000. ఇందులోని నిబంధనలు ఈ క్రింది విధంగా ఉంటాయి :**

i) సంబంధిత అధికారి నుండి వ్రాత పూర్వకంగా అనుమతి తీసుకున్న తరువాత మాత్రమే లౌడ్ స్పీకర్లను, బహిరంగ సభలను ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది.

ii) మూసి ఉంచబడిన ప్రాంగణము అనగా ఆడిటోరియం, కాన్ఫరెన్స్ గది, కమ్యూనిటీ హాలు, బ్యాంక్వెట్ హాలులో తప్ప, రాత్రి వేళలో లౌడ్‌స్పీకర్లను ఉపయోగించడం లేక బహిరంగ సభలను ఏర్పాటు చేయడం, శబ్దము వచ్చే పరికరాలను ఉపయోగించడం లేక మ్యూజిక్ పరికరాలను, లేక సౌండ్ ఆంప్లిఫైర్‌లను ఉపయోగించడం నిషేదము.

iii) బహిరంగ ప్రదేశంలో ఉపయోగించే లౌడ్‌స్పీకర్లు, బహిరంగ సభలకు ఉపయోగించే మైకులు, ఇతర శబ్దాలు వచ్చే పరికరాలను 75 డెసిబుల్స్ మించకుండా లేదా ఆ ప్రాంతమునకు ప్రామాణికంగా నిర్ణయించబడిన శబ్దానికి 10 డెసిబుల్స్ మించకుండా, ఈ రెండింటికీ ఏది తక్కువ అయితే అది ఉండవలెను.

iv) హారన్, శబ్దం కలిగించే నిర్మాణ పనిముట్లు మరియు పేలే మందుగుండు సామాగ్రి, మొదలైన వాటిపై ఆంక్షలు.

- నిశ్శబ్ద ప్రాంతములో లేక నివాసప్రాంతాలలో రాత్రి వేళలలో, అత్యవసర పరిస్థితి ఏర్పడితే తప్ప హారన్ మ్రోగించకూడదు.
- నిశ్శబ్ద ప్రాంతాలలో లేక రాత్రి వేళలలో మందుగుండు సామాగ్రి పేల్చకూడదు.
- నిశ్శబ్ద ప్రాంతాలలో లేక రాత్రి వేళలలో నిర్మాణ పరికరాలను ఉపయోగించరాదు మరియు వాడరాదు.

**7. నిశ్శబ్ద ప్రాంతాలలో ఆజ్ఞలను ఉల్లంఘించుటవలన కలిగే పరిణామాలు :**

నిశ్శబ్ద ప్రాంతాలలో ఈక్రింద తెలుపబడిన ఉల్లంఘనలకు పాల్పడితే చట్టంలోని నిబంధనల ప్రకారం వారికి జరిమానా విధించడం జరుగుతుంది.

i) మ్యూజిక్ లేదా శబ్ద పరికరాలను ఉపయోగించుట.

ii) డ్రమ్ములను లేక డప్పును వాయించుట లేక ఏదైనా శబ్దం కలిగించే మ్యూజిక్ పరికరాలను ఉపయోగించుట.

iii) గుంపును పోగు చేసి మ్యూజిక్ పరికరాలతో ప్రదర్శనలు ఇచ్చుట, మందుగుండు సామాగ్రిని పేల్చుట.

iv) లౌడ్ స్పీకర్లు లేక ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే పరికరాలను ఉపయోగించుట.

**8. శబ్ద కాలుష్యంపై అధికారులకు ఎప్పుడు ఫిర్యాదు చేయవచ్చు?**

- ఎవరైనా పగలు గానీ రాత్రి గానీ 'B' Topic లో నిర్దేశించిన ప్రామాణిక శబ్ద తరంగాల కంటే 10 డెసిబుల్స్ ఎక్కువగా ఏదైనా ప్రదేశంలో చేసి నిబంధనలను ఉల్లంఘించినట్లయితే సంబంధిత అధికారికి ఫిర్యాదు చేయవచ్చు.
- సంబంధిత అధికారి ఫిర్యాదును స్వీకరించి మరియు అమలులో ఉన్న ఇతర చట్టాల్లోని నిబంధనలను కూడా ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటారు.

## G శబ్ద కాలుష్యం గురించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన G.O.లు ఏమిటి ?

A) శబ్దకాలుష్యంపై కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం శబ్దకాలుష్యాన్ని నివారించడంకోసం G.O.M.S. No. 172, తేది. 12-10-2010 న జారీ చేసింది. దీని ప్రకారం కేంద్రం జారీ చేసిన నిబంధనలను అమలు చేస్తూ ఉల్లంఘించిన వారిపై అపరాధరుసుము వసూలు చేయతలపెట్టారు.

శబ్దకాలుష్యం ఒకే ప్రదేశం నుండి వెలువడి, నరాలపై ప్రభావం చూపి రక్తంపై వత్తిడి పెంచినట్లయితే, అట్టి ఉల్లంఘనకు మొదటిసారి 2 వేల రూపాయలు జరిమానా విధించడం జరుగుతుంది. ఆ తరువాతి ఉల్లంఘనలపై 4 వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుంది.

B) పర్యావరణ పరిరక్షణ చట్టం 1986లోని 15 వ నిబంధనల ప్రకారం, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై 5 సం॥ల వరకు ఖైదు మరియు ఒక లక్ష



రూపాయలవరకు జరిమానా లేక రెండింటిని కలిపి విధించవచ్చు. ఉల్లంఘన ఇంకా కొనసాగుతున్నట్లయితే రోజుకు 5 వేల రూపాయల చొప్పున జరిమానా విధించడం జరుగుతుంది.

ఇదే నిబంధనల ప్రకారం శిక్షించబడి, ఉల్లంఘన ఒక సంవత్సరానికి మించి కొనసాగితే, అట్టి ఉల్లంఘన దారులకు 7 సంవత్సరాల వరకు ఖైదు విధించడం జరుగుతుంది.

## H మైకు పెట్టుకొనుటకు అనుమతి తీసుకోవడం ఎలా ? నియమ నిబంధనలు ఏమిటి ?

మీ దగ్గరలోని మీ-సేవ సెంటర్‌లో రోజుకు రూ. 100/- చొప్పున చెల్లించి మైకు అనుమతి తీసుకోవలెను.

హైదరాబాద్ మెట్రోపాలిటన్ పోలీస్ చట్టం 2004 లోని 7వ నిబంధన ప్రకారం, హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టంలోని 22(1) (ఎ) నుండి (ఎఫ్) మరియు 22(2) (ఎ) మరియు (బి) ప్రకారం మైకు లేదా సౌండ్ సిస్టమ్ పెట్టుకోవడానికి పోలీస్ కమీషనర్, డిప్యూటీ కమీషనర్ మరియు ప్రాంతం యొక్క అసిస్టెంట్ కమీషనర్ నుండి అనుమతి తీసుకోవలెను.

**నియమ నిబంధనలు :** (మైకు మరియు సౌండ్ సిస్టమ్ వ్యవస్థ యొక్క వినియోగం కోసం పాటించవలసిన నిబంధనలు)

ధరఖాస్తు దారులు రెండు బాక్సులు కలిగిన స్పీకర్లను మాత్రమే వాడవలెను. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నివాస ప్రాంతంలో రాత్రి గం॥ 10.00 నుండి ఉ॥ 6.00 వరకు ఎటువంటి సౌండ్ సిస్టమ్ కానీ మైకును కానీ వాడకూడదు. అదేవిధంగా ప్రాంతాల వారీగా ఉండవలసిన శబ్ద తీవ్రతకు లోబడి ఉండవలెను. (శబ్ద తీవ్రతకు సంబంధించిన పట్టిక "బి" పాయింట్ లో ఇవ్వబడినది).

సౌండ్ సిస్టమ్ యొక్క వాల్యూమ్ తేది. 11-07-2005 న ఇచ్చిన G.O. Rt. No. 227, పర్యావరణ శాఖ, అటవీశాఖలోని ఫారెస్ట్ సైన్స్ & టెక్నాలజీ (ENV) ప్రకారం ఉండవలెను.

1. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం డి.జె. వాడకాన్ని బహిరంగ ప్రదేశాలలో పూర్తిగా నిషేధించింది కావున మైకు అనుమతి ఉన్నప్పటికీ వాడరాదు.
2. అనుమతి తీసుకున్న ప్రదేశంలో తప్ప వేరే ఏ ప్రాంతంలో మైకు/సౌండ్ సిస్టమ్ వాడరాదు.
3. కార్యక్రమము యొక్క నిర్వహణదారులు ట్రాఫిక్‌కు ఎటువంటి అసౌకర్యం కలిగించరాదు.
4. ప్రజల ప్రశాంతమైన జీవనానికి ఎటువంటి ఇబ్బంది కలిగించరాదు.
5. చుట్టు ప్రక్కల ఉన్న ప్రజలకు ఇబ్బంది కలిగించరాదు.
6. ఎటువంటి సినిమా పాటలుగానీ, సంగీతం గానీ మ్రోగించరాదు.



7. శబ్ద కాలుష్యానికి కారణం కారాదు.
8. అనుమతి తీసుకున్న ప్రదేశంలో ఎటువంటి బాణాసంచా కాల్చరాదు.
9. అవమానపరిచే, అమర్యాదకరమైన, రెచ్చగొట్టే పదాలతో ఏ వ్యక్తులను / పార్టీలను / మతాలను / ప్రాంతాల వారిని / ప్రత్యేక విభాగాలలోని ప్రజలను గానీ ఉద్దేశ్యించి మాట్లాడరాదు.



10. పై నియమాలను పాటించవలసిన పూర్తి బాధ్యత నిర్వాహకులు లేదా ధరఖాస్తుదారులపై ఉంటుంది. పై నియమాలను ఉల్లంఘించిన యెడల హైదరాబాద్ సిటీ పోలీస్ వారు సైబరాబాద్ మెట్రోపాలిటన్ పోలీస్ చట్టం 2004 మరియు ఐ.పి.సి. 188 చట్టంలోని 1348 ఫాల్సి (నెం.IX) 7వ నిబంధన ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది మరియు అనుమతి రద్దు చేయబడును.

## I శబ్ద కాలుష్యంపై వివిధ న్యాయస్థానాలు వ్యక్తపరిచిన అభిప్రాయములు ఏమిటి ?

ఎన్నో చట్టాలు, నిబంధనలు ఉన్నప్పటికీ ప్రజలు వాటిని ఉల్లంఘించి శబ్ద కాలుష్యానికి పాలుపడ్తున్నారు. ఈ శబ్దకాలుష్యం బారిన పడిన అనేకమంది బాధితులు హైకోర్టుకు మరియు సుప్రీంకోర్టుకు వెళ్లి న్యాయం పొందారు.

సుప్రీంకోర్టు మరియు వివిధ హైకోర్టుల తీర్పులను అవగాహన కొరకు ఇవ్వడం జరుగుతున్నది.

- **Case-I : చర్చ్ ఆఫ్ గాడ్ (ఫుల్ గాస్పెల్) ఇన్ ఇండియా Vs. కే.కే.ఆర్. మెజిస్టిక్ కాలనీ సంక్షేమ సంఘం (MANU/SC/0537/2000) :** ఈ కేసులో శబ్దకాలుష్యం ప్రత్యేకించి మత సంబంధమైన చర్యల ద్వారా కలుగుతున్నప్పటికీ వాటి నియంత్రణకు మార్గదర్శకాలను జారీచేయవచ్చు. ఇదే కేసులో ఇంకా ఈ విధంగా తెలియజేయబడింది.

  "వాదనలకు తావు లేకుండా, వివాదాలకు అతీతంగా, ఏమతం కూడా ఇతరుల శాంతికి భంగం కలిగే విధంగా ప్రార్థనలు చెయ్యమని చెప్పలేదు. ఇలాంటి ప్రార్థనలు శబ్ద పరికరాల ద్వారా లేక డ్రమ్ములు వాయించడం ద్వారా చేయవలెనని ఏమతం కూడా బోధించలేదు. మా ఉద్దేశ్యంలో, నాగరిక ప్రపంచంలో మతం పేరుతో వృద్ధులు, బలహీన వ్యక్తుల శాంతికి భంగం కలిగించడానికి, పిల్లలు మరియు విద్యార్థులు వేకువజామున నిద్రపోతుండగా లేదా పగటిపూట శబ్ద కాలుష్యం కలిగించే కార్యకలాపాలను అనుమతించలేము."

  "ఈ సందర్భంగా మనము గుర్తించుకోవలసిన విషయం ఏమంటే మన పొరుగున కూడా చిన్నపిల్లలు ప్రశాంత వాతావరణంలో నిద్రించే హక్కు ఉంటుంది. అదే విధంగా వృద్ధులు కూడా ఖాళీ సమయంలో శబ్దకాలుష్యం లేకుండా ప్రశాంతంగా ఉండడానికి ఆసక్తిని కలిగి ఉంటారు. వృద్ధులు, జబ్బు పడిన వారు, మానసిక రోగులు, 6 సంవత్సరాలలోపు పిల్లలు త్వరగా శబ్దకాలుష్యానికి గురి అవుతారు. వారి హక్కులను కూడా గౌరవించవలసి ఉంటుంది."

- **Case-II : కిరోరి మాయ్ బిషంబర్ దయాళ్ మరియు Vs. రాష్ట్రం (MANU/PH/0003/1958):** "ఈ కేసులో నిందితునికి శబ్దం కలిగించినందుకు మరియు పొగ వదిలినందుకు మరియు నివాసయోగ్యమైన ప్రాంతాలలో భారీ యంత్ర పరికరాలను ఉపయోగిస్తూ ప్రకంపనలను సృష్టించినందుకు ఇండియన్ పీనల్ కోడ్, 1860 లోని 200 ల అధికరణం ప్రకారం శిక్ష విధించబడి 50 రూపాయల జరిమానా కూడా విధించబడింది."




- **Case-III : ప్రచురించబడిన భూబాన్ రామ్ మరియు ఇతరులు Vs. భిభూతి భూషన్ బిశ్వాస్ ఎ.ఐ.ఆర్. 1919 కలకత్తా 539లో:** “ఈ కేసులో బియ్యం మిల్లును రాత్రిపూట ఆడించుచూ అసౌకర్యం కలిగించుచున్నందుకు మిల్లు ఆధీనంలో ఉన్న వ్యక్తిని I.P.C. Section 290 ప్రకారం శిక్షించాలని నిర్ణయించారు.”

- **Case-IV : రాబిన్ ముఖర్జీ Vs. పశ్చిమ బెంగాళ్ రాష్ట్రం (MANU/WB/ 0058/1985) :** ఈ కేసులో శబ్దకాలుష్యాన్ని నివారించేందుకు ఎయిర్ హారన్‌లను నిషేధించారు. కోర్టు వారు ఈక్రింది విధంగా సూచించారు.

  “వివిధ రకాల నిరంతర శబ్దాల వల్ల వాతావరణం మరియు పర్యావరణం కాలుష్యం భారిన పడుతుందని, విమానాశ్రయానికి దగ్గరలో నివసించే వారికి వివిధ రకాలైన వ్యాధులు సోకుతున్నాయని పరిశోధనలలో తేలింది. అటువంటి వ్యక్తులు మానసిక రోగులుగా మారుతారు.”

  పరిశ్రమలలో పనిచేసే వ్యక్తులకు చెవుడు వస్తున్నట్లు, వారికి వినికిడి సమస్య కూడా ఏర్పడుతున్నట్లు వివిధ పరిశోధనలలో తేలింది. ఈ విధమైన శబ్దకాలుష్యం వల్ల ప్రజలకు ఆకలి వేయకపోవడం, అణచి వేయబడినట్లు భావన కలగడం, మానసిక ఆందోళన మరియు నిద్రలేమితనం ఏర్పడతాయని కూడా పరిశోధనలు తెలియజేస్తున్నాయి. దీనికి అదనంగా ప్రజలు తమకు రక్తపోటు ఎక్కువగా ఉంటుందని, గుండె సమస్యలతో బాధపడుతున్నామని ఫిర్యాదులు చేస్తున్నారు.”

- **Case-V : బుర్రాబజార్ మందుగుండు సామాగ్రి డీలర్ల సమాఖ్య Vs. కమీషనర్ ఆఫ్ పోలీస్ కలకత్తా (MANU/WB/ 00078/ 1997)** కేసులో ఈక్రింది విధంగా తీర్పు ఇవ్వడం జరిగింది.

  “రాజ్యాంగంలోని 19వ అధికరణం ప్రకారం వ్యాపార నిర్వహణలో కాలుష్యాన్ని వెదజల్లుతూ ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి మరియు శాంతికి భంగం కలిగించేందుకు ఎలాంటి హక్కు ఇవ్వలేదు. మందుగుండు సామాగ్రి పేల్చినప్పుడు వచ్చే శబ్దాలను ప్రజలకు బలవంతంగా వినిపించలేరు. ఈ శబ్దాలు ఒకరిద్దరికి సంతోషంగా ఉండవచ్చేమోగాని మిగిలిన వారు బలవంతంగా వినలేరు. రాజ్యాంగంలోని 19వ అధికరణం ప్రకారం ప్రజలకు ఇవ్వబడిన ప్రాథమిక హక్కును కాలరాయలేరు, రద్దు చేయలేరు మరియు అపహాస్యం చేయలేరు. రాజ్యాంగంలోని 19వ అధికరణాన్ని 21వ అధికరణంతో అనుసంధానం చేసి చదువగా పౌరులు చక్కటి పర్యావరణం కలిగి శాంతియుతంగా జీవించడానికి హక్కు కలిగి ఉంటారు. రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రకారం వారికి విశ్రాంతి తీసుకోవడానికి మరియు రాత్రి వేళల్లో నిద్రించడానికి హక్కు కలిగి ఉంటారు.”

- **Case-VI : అప్పారావు యం.ఎస్. Vs. తమిళనాడు ప్రభుత్వం (1995) 1L.W.319 (మద్రాస్)** కేసులో, రాష్ట్రంలో నిరంతర శబ్దకాలుష్యం వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు రావడం మరియు శాంతికి భంగం కలుగుతున్నందున రాష్ట్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు రిట్ ఆఫ్ మ్యాండమస్ ఉత్తర్వులు జారీ చేస్తూ యాంప్లిఫైయర్‌లు మరియు లౌడ్ స్పీకర్లు ఉపయోగించడానికి జారీ చేసే లైసెన్స్‌లకు కఠినమైన నియమ నిబంధనలు ఉండవలెనని సూచించింది. అదే విధంగా ఆ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) ను హారన్‌మోతవలె ఉండే లౌడ్‌స్పీకర్లను యాంప్లిఫైయర్‌లను, ఆటోమొబైల్స్‌లోని ఎయిర్ హారన్‌లను పూర్తిగా నిషేధించ వలసినదిగా ఆదేశించారు.

- **Case-VII : పి.ఎ. జాకబ్ Vs. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (MANU/KE/0001/1993)** కేసులో ఈ క్రింది విధంగా తెలియజేయడం జరిగింది. దీని ప్రకారం వాక్ స్వాతంత్ర్య హక్కు అనగా నిశ్శబ్దానికి హక్కు కూడా కలిసి ఉంటుందని తెలియజేశారు. దీని ప్రకారం ప్రసంగాలను వినడం కానీ, బలవంతంగా వినిపించడం నుండి ప్రజలకు స్వేచ్ఛ ఉంటుంది. బహిరంగ ఉపన్యాసాలతో ఎలాంటి ప్రదేశాలలో గాని, ఎలాంటి సమయంలో గాని ప్రజలకు ఎలాంటి భావోద్రేకమైన అభిప్రాయాలు గానీ, హామీలు గానీ ఇవ్వకూడదు. అటువంటి వాక్ స్వాతంత్ర్యం శాంతిభద్రతలకు తర్వాతే వస్తుంది. ఎవరైనా వ్యక్తి ఏదైనా అంశాన్ని చదవడం మానవచ్చు, లేక రేడియో ఆపివేయవచ్చు, లేక టెలివిజన్‌లను కట్టివేయవచ్చు కానీ లౌడ్ స్పీకర్ల ద్వారా తనను చేరే శబ్దాన్ని ఆపలేడు. ఈ విధంగా తనకు ఇష్టం లేని దానిని బలవంతంగా వినిపించినట్లు అవుతుంది. అలా చేసినట్లైతే తన హక్కులలో జోక్యం చేసుకోవడం క్రిందకు వస్తుంది. కావున ప్రతి మనిషికి వినాలనుకునేది వినడం, అవసరం లేనిది మానివేసే హక్కు ఉండాలి.

- **Case-VIII :ఉచిత న్యాయ సలహా సమితి శ్రీ. సుఖాన్‌చంద్ అపర్వాల్ ఎలియాస్ భాటి Vs. గవర్నమెంట్ ఆఫ్ ఎన్.సి.టి. ఢిల్లీ మరియు ఇతరులు (MANU/DE/06/2001).** “ఈ కేసులో కాలుష్యం పర్యావరణాన్ని కలుషితం చేస్తుందని, వ్యక్తుల యొక్క హక్కులకు భంగం కలిగిస్తున్నదని, అలాగే శబ్దం కూడా కాలుష్యాన్ని వెదజల్లుతుందని ఇతరుల ఆరోగ్యానికి భంగం కలిగించుచూ అసౌకర్యానికి గురి చేస్తుందని, పరిమితికి మించినట్లైతే, అది రాజ్యాంగంలోని 21వ అధికరణానికి భంగం కలిగిస్తుందని ఈ తీర్పులో తెలియజేశారు.”

- **Case-IX : చరణ్‌లాల్ సాహు Vs. యూనియన్ ఆఫ్ ఇండియా (MANU/SC/0285/2001).** “ఈ కేసులో సుప్రీంకోర్టు ప్రత్యేక ట్రిబ్యునళ్ళను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను, పర్యావరణ సమస్యలపై ప్రభుత్వానికి సలహా ఇవ్వడానికి నిపుణుల సమాఖ్యను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను గుర్తు చేసింది.”

- **Case-X : యం.సి. మెహతా Vs. యూనియన్ ఆఫ్ ఇండియా (MANU/SC/1081/2003).** “ఈ కేసులో కోర్టు వారు విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవలసినదిగా సూచించడం జరిగింది.”

# సౌండు చేయకు అంతే..!



ఈనాడు, హైదరాబాద్

చెవులు హోరెత్తేలా శబ్దం... తలుపులు గట్టిగా వేసుకున్నా పడకగదుల్లోకి వినిపించేలా సంగీత హోరు... కునుకుపడుతుండగా లౌడ్‌స్పీకర్లలోంచి వచ్చే ప్రసంగాలు... జంట కమిషనరేట్ల పరిధుల్లో రాత్రివేళల్లో కొనసాగుతున్న ప్రసంగ.. సంగీతహింస.. పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నామని అంటూ డీజే సంగీతం పెడుతున్నారు. అర్ధరాత్రి దాటాక బహిరంగసభలు నిర్వహిస్తున్నారు. వీటిపై పలు ఫిర్యాదులు వస్తుండడంతో పోలీసులు స్పందించారు. ఇకపై అతిగా ప్రవర్తిస్తే ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని స్పష్టం చేస్తున్నారు.



### సుప్రీంకోర్టు ఆదేశాలున్నా....

పగలూ, రాత్రి ఎప్పుడైనా సరే... పరిమితికి మించి శబ్దాన్ని వినియోగించినా... ప్రచార సభల్లో మైకుల ద్వారా ప్రసంగాలను ప్రసారం చేసినా కఠిన చర్యలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు కొద్ది నెలల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. విందులు, వినోదాలు, బహిరంగ సభల్లో పరిమితికి మించి సౌండ్ పెడితే పోలీసులు అరెస్ట్ చేయాలని పేర్కొంది. అప్పటి నుంచి పోలీస్ అధికారులు నగరంలోని ఫంక్షన్ హాళ్లు, వివాహవేదికలు, జనావాసాలున్న ప్రాంతాల్లో బహిరంగ సభలు, సమావేశాలపై దృష్టి సారించారు. ముందుగా అనుమతి తీసుకోవాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు నిర్వాహకులు అనుమతి తీసుకుంటున్నా... డీజేలు, ఎక్కువ శబ్దం వచ్చే సంగీత పరికరాలు, దూరానికీ వినబడాలన్న భావనతో మైకుల్లో ఎక్కువగా సౌండ్ వచ్చేలా చేస్తున్నారు. ఊరేగింపుల్లోనూ బ్యాండ్‌మేళంతో ఇలాగే చేస్తున్నారు. పోలీసులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో రోజురోజుకూ ధ్వని కాలుష్యం పెరిగిపోతోంది.

- మైకులు, సంగీత కచేరీలు, ఇతర కార్యక్రమాలకు ప్రాంతాల ఆధారంగా 10 డెసిబుల్స్ నుంచి 75డెసిబుల్స్ లోపు మాత్రమే ఉండాలి.
- ఎవరైనా సరే డీజే వినియోగిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు సంగీత పరికరాలను స్వాధీనం చేసుకుంటారు.
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఐపీసీ 188 సెక్షన్‌తో పాటు సిటీపోలీస్ చట్టం 76 సెక్షన్ ప్రకారం కేసులు నమోదు చేస్తారు.

**● వివిధ సంస్థలకు పోలీసుల హెచ్చరికలు**

**● శబ్దరహిత పరికరాలుంచుకోవాలంటూ తాఖీదులు**

**ఇలా ఫిర్యాదు చేయండి....**

డయల్
**100**

హైదరాబాద్ కంట్రోల్ రూం
**040-2785 2333**

మొబైల్‌యాప్
**హాక్‌ఐ**

సైబరాబాద్ కంట్రోల్ రూం
**040-2785 3412**

వాట్సాప్ నంబర్
**9490617444**

### ప్రతి పోలీస్ ఠాణాకూ వాయిస్ మీటర్లు..


**-ఎం.మహేందర్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్**




నగరంలోని అన్ని ప్రాంతాల్లో రాత్రివేళల్లో చోటుచేసుకుంటున్న ధ్వనికాలుష్యాన్ని నియంత్రించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. కాలనీల్లోని ప్రజలు, పరిసర ప్రాంతాల్లో వారికి అసౌకర్యం కలిగించేవారిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. శబ్దపరిమితులు దాటారని సాక్ష్యాలను సేకరించేందుకు వీలుగా ప్రతి పోలీస్‌ఠాణాకు వాయిస్ మీటర్లను అందజేస్తున్నాం. పోలీసులకు ఫిర్యాదు రాగానే అక్కడికి వెళ్లి సంగీతం, ప్రసంగం ఏ స్థాయిలో ఉందో మీటర్ రికార్డు చేస్తుంది. వెంటనే వారిని అరెస్ట్‌చేసి తప్పించుకోకుండా కోర్టులో ఈ సాక్ష్యాలను సమర్పించనున్నాం. దీంతో పాటు... ఫంక్షన్‌హాల్స్‌పబ్బులు, రెస్టారెంట్లు, కమ్యూనిటీ హాల్స్ సహా వేడుకలను నిర్వహించే సమావేశ మందిరాల యజమానులకు శబ్దరహిత(సౌండ్ ప్రూఫ్)పరికరాలను వినియోగించాలని తాఖీదులు జారీ చేయనున్నాం.

### వందకు డయల్ చేయండి

**- సీవీ ఆనంద్, కమిషనర్, సైబరాబాద్**




సైబరాబాద్ పరిధిలో ఎక్కడైనా సరే... పరిమితికి మించిన శబ్దాన్ని ప్రయోగించిన వారిపై సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. రాత్రివేళల్లో వందకు డయల్ చేయండి... వాట్సప్‌కు ఫోటోలు, వాయిస్, సందేశం ఈ మూడు పంపండి. పది నిముషాల్లో మేం అక్కడికి చేరుకుంటాం. మైకులు, సంగీతపరికరాలు స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేస్తాం. సైబరాబాద్ పరిధిలో ఇప్పటికే డీజేలపై నిషేధం విధించాం. ఫలానా సంగీతం, మైక్ ద్వారా మాకు ఇబ్బంది అని ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఇప్పటికే మేం రాత్రివేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. మా దృష్టికి వచ్చిన చోట్ల చర్యలు తీసుకుంటున్నాం.



# శబ్ద కాలుష్యాన్ని నివారించుటకు తీసుకోవలసిన జాగ్రత్తలు

**1. వినేవారి దగ్గర అదుపు చేయుట :**



శబ్ద కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాలలో పనిచేసే జనాలకు చెవులను రక్షించే ఇయర్ ప్లగ్స్, ఇయర్ మఫ్స్, నాయిస్ హెల్మెట్స్, హెడ్ ఫోన్‌లాంటి పరికరాలను అందించి శబ్ద కాలుష్యాన్ని నియంత్రించవచ్చు.

**2. శబ్దము వెలువడిన చోట నియంత్రించుట :**

పనిచేసే విధానాలను మెరుగు పరుచుట వల్ల ఇది సాధ్యము.



- తక్కువ శబ్దముతో పనిచేయు యంత్రములను రూపొందించి వాటితో ఎక్కువ శబ్దం చేసే యంత్రములను మార్చుట.
- యంత్రములను సరైన పద్ధతిలో నిర్వహించి సరళత పెంచుట ద్వారా శబ్ద కాలుష్యాన్ని తగ్గించవచ్చు.
- అతిగా శబ్దము చేసే యంత్రములను సౌండ్ ప్రూఫ్ గదులలో అమర్చవలెను మరియు శబ్దాన్ని నిరోధించి తగ్గించే పదార్థాలతో మూయవలెను.
- కదిలే మరియు అదిరే యంత్రములనుండి వచ్చే శబ్దమును, యంత్రం యొక్క అడుగు భాగంలో రబ్బరు, నియోప్రిన్, కార్క్ మొదలగు పదార్థములను ఉంచి శబ్దాన్ని తగ్గించవచ్చు.
- వాహనములకు, వాహికలకు వ్యర్థాలు పోవు మార్గాలకు సైలెంజర్‌లను వాడుతూ ఈ వ్యవస్థలకు సంబంధించిన శబ్దము వచ్చు చివరి భాగములు దూరముగా ఉంచవలెను.



- గాజు ఉన్ని (Wool) కానీ లేదా ఖనిజ ఉన్ని కానీ కప్పుతూ చిల్లులతో ఉన్న మెటల్ షీటును యంత్రములను రక్షించుటకు వాడవలెను.
- సరైన సమయంలో వాహనములకు సర్వీసింగ్ మరియు ట్యూనింగ్ చేయడం ద్వారా శబ్ద కాలుష్యాన్ని సమర్థవంతంగా తగ్గించవచ్చు.

**3. ఎకౌస్టిక్ జోనులు :**

పారిశ్రామిక వాడలను, బస్ టర్మినల్‌ను, రైల్వే స్టేషన్‌లను మరియు విమానాశ్రయములను దూర ప్రాంతములలో ఏర్పరుచుట ద్వారా శబ్ద కాలుష్యాన్ని తగ్గించవచ్చు. అదే విధముగా నివాస, విద్యాలయ, హాస్పిటల్స్, ఆలయాలు ఉన్న ప్రాంతాలను నిశబ్ద ప్రాంతాలుగా మార్చవలెను.

**4. నిర్మాణ సమయంలో సౌండ్ ఇన్సులేషన్ :**

- గోడలకు మరియు తలుపులకు మధ్య ఉన్న సన్నని ఖాళీలనుండి శబ్దము ప్రయాణము చేయును. ఈ సన్నని ఖాళీలలో శబ్దమును తగ్గించు పదార్థంతో నింపి కాలుష్యాన్ని తగ్గించవచ్చు.
- వరుసగా 2 లేదా 3 గ్లాస్ కిటికీలు ఉంచి వాటి మధ్య ఖాళీలను శబ్దాన్ని తగ్గించే పదార్థముతో నింపవలెను.
- గోడలపై, సీలింగ్‌పై మరియు నేలపై ఎకౌస్టికల్ టైల్స్, హెయిర్ ఫెల్ట్ ఇన్సులేషన్, పర్ఫరేటెడ్ ప్లైవుడ్‌ను బిగించడం ద్వారా శబ్ద కాలుష్యాన్ని తగ్గించవచ్చు.



**5. చెట్లను పెంచుట :**



రోడ్లపైన, హాస్పిటల్స్ దగ్గర మరియు విద్యాలయాలలో చెట్లను పెంచుట ద్వారా శబ్ద కాలుష్యాన్ని చాలా వరకు తగ్గించవచ్చు.

**6. చట్టపరమైన చర్యలు :**

శబ్ద కాలుష్యాన్ని కలిగించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొనుట ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చు.

**7. ఆలయాలలో శబ్ద కాలుష్యం తగ్గించుట :**

ఈ మధ్యకాలంలో ఆలయాలనుండి తీవ్రమైన శబ్ద కాలుష్యం వెలువడుచున్నది. అది నియంత్రించుటకు కొన్ని పరిష్కార మార్గాలు అమలుపరచవలెను.

A) **గుడి గంటలు :** పూర్వ కాలంలో కంచుతో చేసిన గంటలలో మోదుగ, మారేడు లేదా దేవదారు కర్రతో చేసిన చెక్కను మధ్యలో ఉంచేవారు. దీని వలన గంట కొట్టినపుడు ఠంగుమని కాకుండా నెమ్మదిగా వినసొంపుగా వినబడి శబ్ద కాలుష్యం తగ్గుతుంది.



B) **ఆలయాలలోని సౌండ్ సిస్టం :** కేవలము ఆలయములలో జరిగే కార్యక్రమములకు సంబంధించిన ప్రకటనలు చేయుట కొరకు మాత్రమే హార్న్ స్పీకర్ ఉపయోగించవలెను. అదే విధముగా సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేటప్పుడు గుడి ఆవరణలో ఉన్న భక్తులకి మాత్రమే వినపడే విధముగా ఏర్పాటు చేసుకొనవలెను.

**అంతిమంగా గుడిలో ప్రభుత్వము సూచించిన (నిశ్శబ్ద ప్రాంతం) విధంగా శబ్దం యొక్క పరిమితి పగలు 50 డెసిబెల్స్ మరియు రాత్రి 40 డెసిబెల్స్‌కు మించకుండా ఉండవలెను.**

పైన తెలిపిన అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు అదనముగా క్రింద తెలిపిన సలహాలు పాటించవలెను.

- అన్ని విధాలుగా ప్రజలకు శబ్ద కాలుష్యంపై అవగాహన పెంచవలెను.
- శబ్ద కాలుష్యంపై ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందరికీ తెలుపవలెను.
- శబ్ద కాలుష్య నివారణపై చట్టాలను మరియు ప్రభుత్వం యొక్క ప్రయత్నాలను మరింత బలపరచవలెను.

**మా హృదయపూర్వక విన్నపము ఏమనగా దయచేసి శబ్ద కాలుష్యం కలిగించరాదు మరియు శబ్ద కాలుష్యాన్ని కలిగించేవారిని నిలువరించగలరు.**